ప్రజాశక్తి

సోమవారం 7 అక్టోబర్ 2024 5 విజయనగరం



అనధికార ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో అనధికార ఫ్లెక్సీలు గాని, పోస్టర్లు గాని, గోడరాతలు గాని చేపట్టరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు నగరమంతా అందంగా తీర్చిదిద్దే క్రమంలో తమతో సహకరించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలో ఉన్న గోడరాతులను ప్రత్యేక సిబ్బందితో పట్టణ ప్రణాళిక అధికారులు సున్నాలు వేసి శుభ్రపరిచారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు గోడలపై ఎటువంటి రాతలూ ఉండకూడదన్నారు. పోస్టర్లు అతికిస్తే, మళ్లీ వారితోనే అవి తొలగించి, అపరాధ రుసుం కూడా విధించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గోడలపై కొంతమంది తమ ప్రకటనలను పెయింటింగ్ రూపంలో వేస్తున్నారని వాటిని కూడా నిషేధిస్తున్నట్లు తెలిపారు. పైడితల్లి అమ్మవారి జాతర సమయానికల్లా గోడలన్నీ అందంగా ఉండాలన్నారు.

లిక్కర్ కింగ్‌లెవరో?

- మళ్లీ సిండికేట్లకు జవసత్వాలు
- బెల్ట్ షాపులకు ఊతం
- ధర తగ్గినా మందుబాబుల జేబులకు చిల్లు ఖాయం

ప్రజాశక్తి - రామభద్రపురం

జిల్లాలో లిక్కర్ కింగ్ లెవరో కొద్ది రోజుల్లో తేలిపోనుంది. జిల్లాలో 153 షాపులకు అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం షాపులు ప్రభుత్వ షాపులుగా నడిచాయి. షాపుల్లో సేల్స్‌మేన్లు, సూపర్‌వైజర్ ఉద్యోగాలను భర్తీ చేసి ప్రభుత్వమే వారితో నడిపించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం విధానం అమల్లోకి రావడంతో మళ్లీ ప్రయివేటు షాపులు తెరపైకి వస్తున్నాయి. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం ప్రయివేటు పాపులే నడిచాయి. ఇప్పుడు కూడా అదే తరహాలో మద్యం షాపులు నడిచే అవకాశం ఉంది. ఒక్కో షాపుకి దరఖాస్తు ఫీజు కింద ప్రభుత్వం రూ.2లక్షలు నిర్ణయించింది. ఈ ఫీజు తిరిగి చెల్లించడానికి వీలులేని విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. అయినా దరఖాస్తు చేయడానికి మద్యం వ్యాపారులు వెనుకంజ వేయడం లేదు. పాత విధానంలో వ్యాపారులు దండిగా లాభాలను ఆర్జించారు. ఇప్పుడు కూడా అదే విధానాన్ని అమలు చేయడంతో పాత వ్యాపారులతో పాటు కొత్త వ్యాపారులు కూడా తెరపైకి వస్తున్నారు. ప్రధానంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఐక్యంగా మద్యం వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉబలాట పడుతున్నారు.

సిండికేట్లకు జవసత్వాలు

గతంలో ప్రయివేటు షాపులు నిర్వహించిన సమయంలో వ్యాపారుల సిండికేట్‌గా ఏర్పడిన విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అదే సిండికేట్ వ్యవస్థ రూపుదిద్దుకోనుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వం మద్యం ధరలు కొంత వరకు తగ్గించింది. గత ఎన్నికల్లో మందుబాబులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించింది. అయితే ధరలు తగ్గినా సిండికేట్ వ్యవస్థలో నిర్దేశిత ధర కంటే పది నుంచి 20రూపాయల వరకు పెంచుకునే అవకాశం ఉంది. ఈ వెసులుబాటును గతంలో ప్రభుత్వాలే కల్పించాయి. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి మందుబాబులపై కొంతవరకు భారం పడనుంది. తాజా పరిస్థితుల్లో కూడా సిండికేట్ వ్యవస్థ ఏర్పడి ధరలు పెంచుకునే అవకాశం కలుగుతుంది. దీనికి తగినట్లుగానే వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పాటై మద్యం షాపులకు దరఖాస్తు చేస్తున్నారు. సిండికేట్ వ్యవస్థలో నాటుసారా నియంత్రణ బాధ్యతలను వ్యాపారులే నిర్వహిస్తారు. ఒకవేళ ఎవరైనా సారా విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించి కేసులు నమోదు చేయిస్తారు.

బెల్ట్ షాపులకూ ఊతం

సిండికేట్ వ్యవస్థలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వ్యాపారులకు నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా బెల్ట్‌షాపుల నిర్వహణకు అనుమతులిస్తారు. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించాల్సిందే. బెల్ట్ షాపు యజమాని కూడా నిర్దేశించిన ధరపై ఐదో పదో రూపాయలు పెంచుకునే అవకాశం కల్పిస్తారు. మన్యం జిల్లాలో నాటుసారా విక్రయాలు ఎక్కువగా వున్నాయి. ఏజెన్సీ ప్రాంతం, ఒడిశాతో సరిహద్దులు కలిగి ఉండడంతో నాటుసారా విక్రయాలు గడిచిన ఐదేళ్లలో బాగా పెరిగాయి. ఇప్పుడు ప్రయివేటు మద్యం షాపులు అమల్లోకి రానుండడంతో నాటుసారాపై నియంత్రణకు వ్యాపారులే బాధ్యత వహిస్తారు. నాటుసారా నియంత్రణ జరిగితే తమ షాపుల్లో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని సారా విక్రయాలను నియంత్రించే అవకాశం వుంటుంది.

ఇ-కెవైసి @ 96 శాతం

ఇ-క్రాప్ నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు (ఫైల్)

- మరో రెండు రోజుల్లో ముగియనున్న గడువు
- లక్ష్యానికి మించి ఇ-క్రాప్ బుకింగ్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వ్యవసాయ పంటల గుర్తింపు విషయంలో రైతుల ఇ-కెవైసి నమోదు 96 శాతానికి చేరింది. ఇ-క్రాప్ నమోదు లక్ష్యానికి మించి చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఇ-కెవైసికి మరో రెండు రోజులు సమయం ఉంది. ఈలోపు ఈ లక్ష్యాన్ని పూర్తిచేస్తామని వ్యవసాయ శాఖ అధికారుల, క్షేత్ర స్థాయి సిబ్బంది ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత నెల 25వ తేదీతో ఇ-కెవైసి నమోదు పూర్తిచేస్తామని అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికి 81 శాతం మాత్రమే ఇ-కెవైసి నమోదైంది. ఈ నేపథ్యంలో ఈనెల 9వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో, ఇ-క్రాప్ నమోదు లక్ష్యాన్ని మించగా, ఇకెవైసి లక్ష్యానికి చేరువగా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. రైతులు ప్రభుత్వ సబ్సిడీ, కనీస మద్దతు ధర పొందాలన్నా, చివరికి పంటల బీమా వర్తించాలన్నా ప్రభుత్వం ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వులు, జీడిమామిడి పంటలకు మాత్రమే బీమా పథకం వర్తిస్తుంది. ఈనేపథ్యంలో ఈ పంటలన్నింటినీ ప్రభుత్వం తరపున ఇకెవైసితో కూడిన ఇ-క్రాప్ నమోదు ప్రభుత్వం తరపున చేపడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఈ నాలుగు పంటలు కలిపి సుమారు 3.61 లక్షల మేర సాగవుతుందని, నూరు శాతం ఇ-క్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అధికారులు ఊహించిన దానికి మించి 3.64 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగయ్యాయి. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో అధికారులు సఫలీకృతులయ్యారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు అందుబాటులోకి రాకపోవడంతో ఇకెవైసి నమోదు మాత్రం 96 శాతం వద్ద ఉంది. మరో రెండు రోజులు సమయం ఉండడంతో రైతులంతా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.

పంటల వారీగా పరిశీలిస్తే...

జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఇ-కెవైసిలో నమోదు చేసిన పంటలను పరిశీలిస్తే.. అత్యధికంగా 1,70,536 మంది రైతులు 2,40,627 ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇందులో 1,61,467 మంది రైతులకు చెందిన 2,32,956 ఎకరాలకు (96 శాతం) సంబంధించి ఇకెవైసి నమోదైంది. మిగిలిన 7,671 ఎకరాలకు చెందిన 9,069 మంది రైతులు ఇంకా ఇ-కెవైసి నమోదు చేయించుకోవాలి. మొక్కజొన్న 17,697 ఎకరాలకు గాను 16,791 ఎకరాలు (95 శాతం) నమోదైంది. ఈ పంటకు సంబంధించి ఇంకా 1,112 మంది రైతులు ఇ-కెవైసి వేయాల్సి ఉంది. 4,680 మంది పత్తి రైతులు 97 శాతం సాగుకు ఇ-కెవైసి నమోదు చేయించుకున్నారు. జీడిమామిడి రైతులు 93శాతం సాగుకు సంబంధించి నమోదయ్యారు. ఇకెవైసి పూర్తికాగానే రైతులు, వారికి సంబంధించిన భూములు, అందులో పంటలు తదితర వివరాలతో కూడిన జాబితా ఖరారు చేసి గ్రామసభల్లో ప్రవేశపెడతారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుదిజాబితాను ప్రభుత్వానికి నివేదిస్తారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశకి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ సిరిమానోత్సవం సమీపిస్తున్న వేళ ఆదివారం సాయంత్రం చదురుగుడి వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు, దేవాదాయ శాఖ ఎడిసి రామచంద్ర మోహన్, ప్రత్యేకాధికారి పి.త్రినాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లను ఇఒ ప్రసాదరావు వారికి వివరించారు. ఆలయం వెనుక చెట్టు వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ఎడిసి రామచంద్ర మోహన్ సూచించారు. వెనుకద్వారం వద్ద గోడ తొలగిస్తే కలిగే ప్రయోజనం, డస్ట్ బిన్ల తొలగింపు, పరిసరాల పరిశుభ్రత గురించి దేవస్థానం అధికారులకు సూచనలు చేశారు. తొలుత వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

జెవివి జిల్లా కమిటీ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఎస్ఇగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జెవివి జాతీయ ప్రధానకార్యదర్శి ఎంవిఆర్ కృష్ణాజిని ఘనంగా సత్కరించారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఎరుకొండ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, సీనియర్ నాయకులు గండ్రేటి లక్ష్మణరావు, గండ్రేటి అప్పలనాయుడు పాల్గొన్నారు.

జిల్లాలో ఇసుక కొరత లేదు

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్
- అక్రమ రవాణాపై కఠిన చర్యలు : ఎస్‌పి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఇసుక కొరత లేదని, వచ్చే ఆరు నెలల అవసరాలకు సరిపడా ఇసుక మనకు అందుబాటులో ఉందని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. నూతన ఇసుక పాలసీ, ప్రస్తుతం ఇసుక లభ్యత, సరఫరాపై స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్‌తో కలిసి జెసి ఆదివారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఇసుక సరఫరాపై తాజాగా ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాలను వివరించారు. ప్రస్తుతం బొబ్బిలిలో సుమారు 300 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, కావాల్సిన వారికి సరఫరా చేస్తున్నామని చెప్పారు. రవాణా, హ్యాండ్లింగ్ ఛార్జీల కింద మెట్రిక్ టన్నుకు రూ.577 చొప్పున వినియోగదారులు చెల్లించాల్సి ఉందన్నారు. వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద డిసిల్టింగ్ ప్రక్రియను మొదలు పెట్టామని, ఇక్కడినుంచి సుమారు 70వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభిస్తుందని చెప్పారు. ఇక్కడి నుంచి బొబ్బిలి స్టాక్‌పాయింట్‌కు తరలించి, వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. చీపురుపల్లిలో కూడా త్వరలో కొత్తగా స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి, ఇసుకను సరఫరా చేస్తామన్నారు. తెర్లాం, సంతకవిటి మండలాల్లో కొత్తగా రెండు ఇసుక రీచ్‌లను గుర్తించామని, ఈనెల 15న ఇక్కడ తవ్వకాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ నెల 16 నుంచి ఇసుక పూర్తిగా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తున్నట్లు జెసి వెల్లడించారు. ఇసుక కావాల్సినవారు ఎవరైనా ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వినియోగదారులు సొంతంగా వాహనం తెచ్చుకుంటే, దానిలో ఇసుక నింపి తీసుకువెళ్లవచ్చని తెలిపారు. జిల్లాలో ఆర్‌టిఒ వద్ద నమోదు చేసుకున్న 175 వాహనాలు, జిపిఎస్ విధానంతో అనుసంధానించబడి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటి ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీలను చెల్లించి ఇసుకను తీసుకువెళ్లవచ్చని సూచించారు. ఇసుక తవ్వకాలు, సరఫరా, రవాణాపైనా నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. థర్డ్ పార్టీ ద్వారా కూడా ఇసుక సరఫరాపై నిఘా ఉంచుతున్నామని తెలిపారు.

జిల్లా కేంద్రానికి సమీపంలోని డెంకాడ స్టాక్ పాయింట్‌లో కూడా త్వరలో ఇసుక అందుబాటులో ఉంచుతామని తెలిపారు. బల్క్‌సప్లై కోసం ఆరు దరఖాస్తులు వచ్చాయని, వీటిలో రెండింటిని తిరస్కరించామని, మిగిలిన వారికి ఇసుక సరఫరా చేస్తామని జెసి వివరించారు. ఇప్పటివరకు సుమారు 52 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రయివేటు భూముల్లో ఉన్న ఇసుక మేటలను కూడా అనుమతి తీసుకొని సరఫరా చేయవచ్చునని తెలిపారు.

ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీరికి భారీగా జరిమానా విధించడంతోపాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అక్రమ మైనింగ్, రవాణాపై నిరంతరం నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన, అత్యంత సులువుగా, ఉచితంగా ఇసుక పొందేవిధానాన్ని వినియోగించుకోవాలని ఎస్‌పి సూచించారు.

కళాశాల నుంచి వెళ్లిపోతున్న విద్యార్థులు

సెలవుల్లో తరగతుల నిర్వహణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించి నాలుగు రోజులు గడుస్తున్నా విజయనగరం జిల్లాలో మాత్రం సర్కారు ఆదేశాలను పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు బేఖాతరు చేస్తున్నాయి. సెలవుల్లోనూ పలు కళాశాలలు, పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయి. దీంతో ఎస్ఎఫ్ఐ బృందం ఆయా కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలను సందర్శించింది. తరగతులు నిర్వహిస్తున్న యాజమాన్యాలతో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడి విద్యార్థులకు సెలవులు ప్రకటించి ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు కె.రాజు మాట్లాడుతూ నగరంలో పలు విద్యాసంస్థలు ఇప్పటికీ దసరా సెలవులు ప్రకటించలేదని తెలిపారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు మొద్దునిద్ర వీడి తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సోమేష్, నాయకులు గుణ, మురళి, వాసు ,అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెగ్యులర్ చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 1998 ఎంటిఎస్ టీచర్లు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుకు వినతి అందించారు. ఎపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ప్రతి ఏటా 12 నెలల జీతం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ కర్రి రవి పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాల్లో కవి సమ్మేళనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 13, 14 తేదీల్లో విజయనగరం ఉత్సవాల్లో సాహితీ కార్యక్రమాలను స్థానిక ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ వెల్ఫేర్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు సాహితీ వేదిక కన్వీనర్ గంట జనార్దన నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10 గంటలకు డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం దర్శకత్వంలో సుభద్ర దేవి నిర్వహణలో భువన విజయం నాటకం ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కన్వీనర్లుగా మానాప్రగడ సాహితి, రత్నాల బాలకృష్ణ, కో-కన్వీనర్లుగా చీకటి దివాకర్, భోగరాజు సూర్యలక్ష్మి , ఎన్.కె.బాబు శతాధిక కవి సమ్మేళనం విజయనగరం జిల్లా కవులతో నిర్వహించనున్నారని తెలిపారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు ముందుగా తమ కవితలను పదో తేదీలోగా రత్నాల బాలకృష్ణ (9440143488), చీకటి దివాకర్ (9441176882), భోగరాజు సూర్యలక్ష్మి (9440117116) నంబర్లకు పంపించాలని కోరారు. దేశభక్తి, సామాజిక స్పృహను కవితా అంశంగా తీసుకొని 20 నుండి 30 పంక్తులకు మించకుండా కవితను పంపించాలని సూచించారు. 14న డాక్టర్ జక్కు రామకృష్ణ, జి.ఎస్. చలం ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్తలతో సాహితీ గోష్ఠి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం డాక్టర్ ఎ.గోపాలరావు ఆధ్వర్యంలో డాక్టర్ మీగడ రామలింగస్వామితో సంగీత నవావధానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ముఖ్య కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించిన వారిపై 20 డిడి కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 174 ఒడి కేసులు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో ఎంవి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 383 ఇ-చలానాలను విధించారు. మద్యం సేవించి, వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారికి సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించారు. రహదారి ప్రమాదాలకు కారకులు కావద్దని, ప్రమాదాలకు గురవ్వవద్దని ఎస్‌పి కోరారు.

అందరికీ ఉచిత దర్శనం

- 3 గంటలకే సిరిమాను సంబరం
- రూ.50 లక్షలతో పైడితల్లమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు
- ప్రజాశక్తితో పైడితల్లమ్మ దేవస్థానం సహాయ కమిషనర్ డివివి ప్రసాదరావు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'ఈ నెల 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమాను సంబరానికి పైడితల్లమ్మ దేవస్థానం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అమ్మవారి దర్శనం కోసం వచ్చే యాత్రికులు ఉచితంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నా'మని పైడితల్లమ్మ దేవస్థానం సహాయ కమిషనర్ డివివి ప్రసాదరావు తెలిపారు. ఈ ఏడాది సకాలంలో సిరిమానోత్సవం నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రూ.50 లక్షలతో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పైడితల్లమ్మ ఉత్సవాల నేపథ్యంలో విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యలను ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



ఈ ఏడాది పైడితల్లమ్మ జాతరకు ఎంతమంది ప్రజలు వచ్చే అవకాశం ఉంది.?

ఈ నెల 14న తొలేళ్ల ఉత్సవం జరగనుంది. 15న ప్రధాన ఘట్టమైన సిరిమాను సంబరానికి బయట నుంచి 3 లక్షల నుంచి 4 లక్షల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉంది. నగర జనాభాతో కలుపుకుంటే సుమారుగా 6 లక్షల వరకు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉంది.

దర్శనం చేసుకునేందుకు చేపట్టిన చర్యలు ఏమిటి.?

పండగకు వచ్చే జనం ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా తూర్పు వైపు మూడు లాంతర్ల కూడలి నుంచి కోట వైపు రెండు క్యూలైన్లు, పడమర నుంచి ఎంజి రోడ్డు వైపు రెండు క్యూలైన్లు ఏర్పాటు చేస్తాం. క్యూలైన్ల యాత్రికులు ఎండ బారిన పడకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నాం. వికలాంగులకు, వృద్ధులకు ప్రత్యేకంగా వీల్‌చైర్లు ఏర్పాటు చేస్తాం. వారి కోసం రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్ల సహకారం తీసుకుంటున్నాం.

ఈ ఏడాది విఐపి పాసులు, టోకెన్ దర్శనాలు ఉన్నాయా.?

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది టోకెన్ దర్శనాలు లేవు. సామాన్యుల నుంచి విఐపిల వరకు ఉచితంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. సర్వ దర్శనం ద్వారా వేగంగా అమ్మవారి దర్శనం చేసుకునేలా చూస్తున్నాం.

పండగకు ఎంతమంది సిబ్బందిని నియమించారు.?

పైడితల్లమ్మ ఉత్సవాలకు ఉత్తరాంధ్రలో ఉన్న దేవాదాయ శాఖ సిబ్బంది 100 మంది వరకు వస్తున్నారు. చదురుగుడి, వనంగుడి వద్ద మూడు షిఫ్ట్‌ల్లో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారు. వీరితోపాటు పోలీస్, ప్రభుత్వ యంత్రాంగం, నగర పాలక సంస్థ సిబ్బంది ఉంటారు. పండగ నేపథ్యంలో పర్యవేక్షకులుగా సింహాచలం దేవస్థానం ఇఒ వి.త్రినాథరావును ప్రభుత్వం నియమించింది.

ఎంతమందికి ప్రసాదం అందుబాటులో ఉంచనున్నారు.?

ఈ ఏడాది 50 వేల వరకు లడ్లు తయారు చేస్తున్నాం. పులిహోరా సరిపడినంత తయారు చేసి అందించనున్నాం. లడ్డు రూ.15, పులిహోరా ప్యాకెట్ రూ.10కు విక్రయిస్తారు.

సిరిమాను సంబరం ఎన్ని గంటలకు ప్రారంభం కానుంది.?

15న జరిగే అమ్మవారి సిరిమాను సంబరం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. సిరిమాను మధ్యాహ్నం 12 గంటలకు హుకుంపేటలో బయలుదేరి పుచ్చలవీధి, కన్యకాపరమేశ్వరి కోవెల జంక్షన్, గంట స్థంభం కూడలి మీదుగా ఆలయానికి చేరుకుంటుంది. మధ్యాహ్నం మూడు గంటలకు సిరిమానోత్సవం ప్రారంభించేలా ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలిచ్చింది. సిరిమానోత్సవ బాధ్యతలు ఆర్‌డిఒకి అప్పగించారు.

యాత్రికుల కోసం తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి.?

అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న యాత్రికులకు మజ్జిగ, బిస్కెట్లు అందిస్తారు. ఇందుకోసం వాలంటీర్లను నియమించాం. వీరితో పాటు నగరపాలక సంస్థ సహకారంతో తాగునీటి చలివేంద్రాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. ఆలయ పరిసరాల్లో 10 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. ఆలయం వద్ద ఇప్పటికే 45 సిసి కెమెరాలు ఉన్నాయి. మరో 60 నుంచి 80 సిసి కెమెరాలను సిరిమాను తిరిగే ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిరోజూ ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. పైడితల్లమ్మ పండగను విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలి.

రోడ్డు సౌకర్యం కల్పించండి మహాప్రభో..!

ప్రజాశక్తి - వేపాడ

ఉత్తరాంధ్ర జిల్లాల్లో 200 సంవత్సరాల చరిత్రకలిగిన గుడివాడ సమీపంలోని శ్రీ బ్రహ్మ లింగేశ్వర ఆలయం బ్రిటిష్ పరిపాలన కాలంలో ఎత్తైన కొండపై నిర్మించారు. ఈ ఆలయానికి కార్తీకమాసంలో అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. అటువంటి ఆలయానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో యాత్రికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆకుల సీతంపేట నుంచి సుమారు కిలోమీటరు వరకు మట్టి రోడ్డు వేసినా వర్షా కాలం ఈ రోడ్డు బురదగా మారడంతో నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మెటల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వేలాదిగా తరలి వచ్చే యాత్రికులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఈ దారే దిక్కు

నాయకులు ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం విద్యార్థి యువజన సంఘాలు, కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నేతలు ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం బొబ్బిలిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్నం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్ను అదానీ అంబానీలకు కారు చౌకగా కట్టబెట్టడానికి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయి. దీన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ఆందోళన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం కూడా పాల్గొనాలని డిమాండ్ చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - శృంగవరపుకోట

సమాచార హక్కు చట్టం వచ్చి ఈ నెల 12 నాటికి 19 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో సమాచార హక్కు చట్టం జిల్లా సమన్వయ కమిటీ మెంబర్ దొడ్డి సూర్యారావు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠకులకు సహచట్టంపై పూర్తిగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి డి శ్రీధర్ గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యారావు

లలితాదేవిని దర్శించుకుంటున్న కర్రోతు బంగార్రాజు, తదితరులు

లలితాదేవిని దర్శించుకున్న కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం

దసరా నవరాత్రులు సందర్భంగా విజయవాడ దుర్గాదేవి ఆలయంలో లలితదేవి అమ్మవారిని ఏపి మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు డైరెక్టర్ అనేపు రామకృష్ణ నాయుడు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి

ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు తక్షణమే చేపట్టాలని ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమర్ భవన్లో ఎస్టియు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు కె.జోగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనకు ఆటంకం కలిగించే యాప్లను రద్దు చేయాలన్నారు. ఆర్థిక బకాయిలు, పిఎఫ్ లోన్లు, ఏపిజిఎల్ఐ రుణాలు, సెలవుల నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిఒ 117 రద్దు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, రాష్ట్ర నాయకులు డి.శ్యామ్, వసంతం గోవిందరావు, జిల్లా నాయకులు ఎం.మురళీ, జి.రవి, పి.రాంబాబు, ఎస్.బంగారయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్యాంపు కమాండర్ కల్నల్ టాపస్ మండల్

ఎన్సిసి క్యాడెట్లకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

సీతం కళాశాలలో రెండో ఆంధ్రా సిటిఆర్ ఆధ్వర్యంలో ఎన్సిసి క్యాడెట్లకు వార్షిక శిక్షణ శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. క్యాంపు కమాండర్ కల్నల్ టాపస్ మండల్ మాట్లాడుతూ క్యాడెట్ల నైపుణ్యాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు దేశభక్తి, సేవా స్ఫూర్తిని పెంచడమే శిబిరం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పది రోజులపాటు జరిగే ఈ శిబిరంలో ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ సంబరాలకు ఎన్సిసి క్యాడెట్లను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ క్యాడెట్లకు అన్ని అవసరమైన వసతులు అందిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ పల్లవి వర్మ, సీతం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పిఎంశ్రీ పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో పిఎం శ్రీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత విద్యా సంవత్సరంలో సుమారు రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మితమవుతున్న భవనం సకాలంలో బిల్లులు చెల్లింపులు జరగక గుత్తేదారు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. గత కొద్దిరోజుల నుంచి భవన నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు సన్షైడ్ శ్లాబు వేసి పైన శ్లాబ్ వేసి గోడలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

పంచాయతీ మహిళా కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని చిన్నబొండపల్లికి పంచాయతీ కార్యదర్శిగా విశేష సేవలందించి బదిలీపై వెళ్తున్న వంగల స్వాతికి ఆదివారం పంచాయితీ సర్పంచ్ గండి శంకర్రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి శాలువాతో సత్కరించి ఆమె చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిండు మనసుతో గ్రామస్తులు చేసిన సన్మానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని అన్నారు.

బడిదేవర కొండకు వరద పాయసం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రతి ఏటా వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం మండలంలోని ములగ పంచాయతీలో ఉన్న బడిదేవర కొండకు వరద పాయసం పోసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా ఆదివారం సంగంవలస గ్రామస్తులు, రైతులు, సర్పంచి శ్రీరంజన్, మాజీ సర్పంచ్ అమరాపు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వరద పాయశం పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల ప్రజలకు ఇష్ట దైవమైన బడిదేవరకొండను గ్రానైట్ తవ్వకాల పేరిట ప్రభుత్వం లైసెన్సులు ఇవ్వడం ఇక్కడ ప్రజల మనోభావాలకు దెబ్బతీయడమేనని అన్నారు. కనుక వెంటనే లైసెన్సులు రద్దు చేయాలని కోరారు.

కూటమిలో కుదరని సయోధ్య

● బదిలీల్లో ఎమ్మెల్యేదే తుది నిర్ణయం ●టిడిపి నాయకుల సిఫార్సులు బుట్టదాఖలు ●కర్రోతుకు మార్క్ఫెడ్ పదవితో తమ్ముళ్లలో చిగురించిన ఆశలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నియోజకవర్గంలో జనసేన, టిడిపి, బిజెపి కూటమి నాయకుల్లో సయోధ్య కుదరడం లేదని దీంతో బహిరంగంగానే టిడిపి, జనసేన నాయకులు విమర్శలు చేసకుంటున్నారని మండలంలో చర్చ జరుగుతోంది. సాధారణ ఎన్నికల్లో టిడిపి, జన సేన, బిజెపి కలసి పోటీ చేసి విజయాన్ని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉన్నప్పటికీ పొత్తు కారణంగా జనసేనకు టిక్కెట్టు కేటాయించి ఎమ్మెల్యేగా గెలిపించారు. అయితే జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన లోకం మాధవి తరువాత రోజుల్లో టిడిపి శ్రేణులను పట్టించుకోలేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు ఏదో మొక్కుబడిగా టిడిపి నాయకులు హాజరవుతున్నారు గాని ప్రాధాన్యత ఉండడంలేదని ఆవేదన చెందుతున్నారు.

ఉద్యోగుల బదిలీల్లోనూ అదే తీరు

ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల్లో కొంత మంది పేర్లు టిడిపి శ్రేణులు ప్రతిపాదించినా ఎమ్మెల్యే పట్టించుకోకుండా తనకు నచ్చిన వారిని తీసుకు వచ్చారని సమాచారం. మండలాల స్థాయిలో కాకపోయినా గ్రామ స్థాయి ఉద్యోగులకు సంబంధించిన సిఫార్సులను కూడా బుట్ట దాఖలు చేసి ఆమె తుది నిర్ణయంగా వ్యవహరించారని భోగట్టా. ఈ విషయంపై జిల్లా నాయకులు దృష్టికి తీసుకువెళ్ళినా మీ నియోజక వర్గం గురించి మాదగ్గర చెప్పవద్దని సదరు నాయకులు నచ్చజెప్పి పంపించేసినట్లు తెలిస్తోంది. దీంతో స్థానిక టిడిపి నాయకులు ప్రభుత్వం ఏర్పాటు చేసినా ప్రతిపక్షంలో ఉన్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా ఎడ ముఖం పెడ ముఖంగా ఉంటున్నారే తప్ప ఎవరికీ ప్రాధాన్యత లేదన్నది తేటతెల్లమవుతోంది.



మార్క్ఫెడ్ బాధ్యతలతో కొత్త ఊపు

కాగా టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజుకు మార్క్ఫెడ్ రాష్ట్ర చైర్మన్గా బాధ్యతలు అప్పగించిన తరువాత టిడిపి శ్రేణుల్లో కొత్త ఊపు కనిపిస్తోంది. ఇక మీదట తమకు ప్రాధాన్యత ఇవ్వని ఎమ్మెల్యే వద్దకు వెళ్లకుండానే తమ నాయకుడు కర్రోతు బంగార్రాజు వద్దకు వెళ్లి తమ పనులు చేసుకోవచ్చునని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇది ఇంత వరకూ సఫలీ కృతమవుతోందో వేచి చూడాలి.

పూజలు చేస్తున్న మంత్రి

మంత్రి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - బొండపల్లి

దేవి నవ రాత్రులను పురస్కరించుకుని మండలంలోని దేవిపల్లి గ్రామంలో గల రాజరాజేశ్వరి దేవిని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి శ్రీనివాస్కి పురోహితులు వేదలాంఛనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన వెంట గజపతినగరం మాజీ ఎంపిపి మక్కువ శ్రీధర్, దేవుపల్లి మాజీ సర్పంచ్ రాపాక అచ్చుం నాయుడు తదితరులు ఉన్నారు.

సిఐటియుతోనే హక్కుల సాధన : తమ్మినేని

ప్రజాశక్తి - రాజాం

సిఐటియుతోనే హక్కుల సాధన సాధ్యమని సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. సిఐటియు జిల్లా కమిటీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు అధ్యక్షతన సిఐటియు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా, అంగన్వాడి, ఆర్పి, విఒఎ, మున్సిపాల్ వర్కర్లు, విఆర్ఎలు, స్కూల్ ఆయాలు, గ్రీన్ అంబాసిడర్లు, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులు తీవ్రమైన శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యుటి, అమలు కావడం లేదని పని భారం ఒత్తిడి పెరుగుతుందని నూటికి 90శాతంగా ఉన్న అసంఘిటిత రంగ కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించడం లేదని చెప్పారు. వీటిపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ సిఐటియు పద్ధతులకు భిన్నంగా తానే మంత్రి తానే రాజు అన్నట్లుగా రామ్మూర్తినాయుడు వ్యవహారం సాగిందని, వివిధ సంఘాల కార్మికులు ఇచ్చిన డబ్బులను జిల్లా కేంద్రంలో జమ చేయకుండా తమ సొంతానికి వాడుకుని, ఆర్థిక అవినీతికి పాల్పడ్డానని, అందుకే సిఐటియు నుంచి రామ్మూర్తిని తొలగించామని తెలిపారు. అతను ఏ తప్పు చేయకుండా ఉంటే తన నిజాయితీని జిల్లా కమిటీలో నిరూపించుకోవాలన్నారు. తొలగించామని ప్రకటించిన తర్వాత కూడా కొంతమంది కార్మికులను పోగేసి తానేమీ తప్పు చేయలేదని రామ్మూర్తి నాయుడు కావాలని లెటర్లు రాయించుకోవడం వాటిని కార్మికులు పెట్టి గందరగోళానికి గురి చేయడం వంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. రాజాం పూర్వ నాయకులు ఎం. తిరుపతిరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రావు, టీవీ రమణ, శ్రీకాకుళం జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ నాగమణి, అంగన్వాడీ యూనియన్ మన్యం జిల్లా అధ్యక్షులు హిమప్రభ, విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మీ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. పైడిరాజు, ఎస్. అనసూయ, ఆశావర్కర్ జిల్లా కార్యదర్శి బి. సుధారాణి, విఆర్ఎ సంఘం అప్పలస్వామి నాయకులు మాట్లాడుతూ నిరంతరం కార్మిక హక్కుల కోసం ఢిల్లీ నుంచి గల్లీ వరకు పోరాడే జెండా సిఐటియు అని, అనేక మంది త్యాగాలతో ఏర్పడిన సిఐటియు ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఎంతటి పెద్ద నాయకుడినైనా తీసి పక్కన పెడతామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్రావు, రాజాం నాయకులు విశ్వనాథం, త్రినాథ్, అర్జున్, అసిరప్పడు, ఆదినారాయణ, ఆశ, అంగన్వాడి, బిల్డింగు, విఆర్ఎ, హమాలీ, మున్సిపల్ కార్మికులు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

ఆగని ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. చంపావతి నది పరివాహక ప్రాంతంలో జరజాపు పేట, మొయిద కాజ్ వే, రామతీర్థం కాజ్ వే, జూట్ మిల్లు వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, నాటు బల్లు, ద్వి చక్ర వాహనాల ద్వారా తరలించి వేరే ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రుళ్ళు లారీల ద్వారా తరలిస్తున్నారు. జ్యూట్మిల్ బ్రిడ్జి సమీపంలోని నీటి పథకాల వద్ద కూడా మిని ఆటోలు, ఎడ్ల బళ్ళు ద్వారా ఇష్టానుసారంగా రవాణా జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తుంది. మంచి నీటి పథకాల వద్ద కూడా ఇసుక తవ్వకాలు జరుపుతుండటంతో అవే కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ట్రాక్టర్లు, లారీలు నదిలోకి దిగని ప్రాంతంలోకి ఎడ్లబళ్ళు, ఆటోలను దించి వాటి ద్వారా ఇసుకను నిల్వ చేసి రాత్రి వేళల్లో లారీల ద్వారా అమ్మకాలు జరిపి అక్రమార్కులు వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఇసుక అక్రమ రవాణాపై మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా అడ్డూ, అదుపూ లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతుందంటే కూటమి నాయకుల సహకారం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమకేటని ఇసుక మాఫియా రెచ్చిపోయి మరీ డంపింగ్ చేసి లక్షలాది రూపాయల ఇసుకను తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మొయిద కాజ్ వే రైల్వే పట్టాల వద్ద డంప్ చేసిన ఇసుక

దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - మెంటాడ

దేశంలో దళితుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని, దళితుల రక్షణ, కులవివక్ష నిర్మూలనకు ఐక్యంగా పోరాడాలని డప్పు కళాకారుల సంఘ గౌరవ అధ్యక్షులు రాకోటి రాములు డిమాండ్ చేశారు. ఆదివారం ఆగూరు పంచాయతీ మధుర గ్రామం రెల్లిగూడెంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రామప్పలస్వామి అధ్యక్షతన కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాములు మాట్లాడుతూ ప్రపంచంలో కులం అనేది లేదని, బారతదేశంలో కులం వుందని దళిత, గిరిజన ఇతర వెనుకబడిన, నిమ్మకులాలు ఇప్పటికీ కులవివక్షకు గురవుతున్నారని కులనిర్మూలన జరగాలని ఐక్యంగా పోరాడాలన్నారు. డాక్టరు బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సంఘ పరివార శక్తుల నుండి కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగ ఫలాలు దళితులకు అందేవిధంగా కృషి చేయాలని, భూములు పంచాలని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్తేటి లక్ష్మీ, పొట్నూరు నారాయణరావు, ధనాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, దళితులు

వాడిపోతున్న మొక్కలు

నీరు లేక ఎండుతున్న మొక్కలు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణ సుందరీకరణ కోసం నాటిన మొక్కలకు నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. పట్టణ సుందరీకరణ కోసం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పువ్వులు మొక్కలు నాటారు. మొక్కలకు నీరు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. మొక్కల సంరక్షణకు గతంలో దినసరి వేతనంతో 16 మంది కార్మికులను మున్సిపల్ అధికారులు నియమించారు. ఆయా కార్మికులు రాణిమల్లమ్మదేవి పార్కు, యుద్ధ స్తంభం పార్కులో మొక్కలను సంరక్షించి పరిసరాలను పరిశుభ్రం చేసేవారు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఉన్న పువ్వులు మొక్కలకు, ఆర్టిసి కాంప్లెక్స్ నుంచి జ్యూట్ మిల్లు వరకు రోడ్డు మధ్యలో మొక్కలకు నీరు పోసి సంరక్షణ చూసే వారు. దినసరి వేతనంతో పని చేస్తున్న కార్మికులకు చెల్లించే వేతనాల వివరాలు సక్రమంగా రికార్డులో నమోదు చేయకపోవడంతో ఆడిట్ కమిటీ అభ్యంతరం చెప్పి వేతనాలు బిల్లులు నిలిపివేశారు. దినసరి వేతనాలతో పని చేస్తున్న కార్మికులను మూడు నెలల నుంచి పనిలోకి తీసుకోలేదు. దీంతో మొక్కలు సంరక్షణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి మొక్కలు సంరక్షణ చేసి ప్రతిరోజు నీరు పోసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరాలకు విశేష స్పందన

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని చొక్కాపు వీధి రామమందిరం వద్ద ఆదివారం చొక్కాపు వీధి యువత, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు యువసేన ప్రతినిధులు రామసందీప్, రామ్ చరణ్ల ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ కార్పోరేట్ ఆస్పత్రి యాజమాన్యం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 200 మంది రోగులు హాజరయ్యారు. వీరికి వైద్యులు హరిజగన్, అభినయ్, ప్రత్యూష్, సునీల్, సంజీవనాయుడు, భార్గవి, ఈసీజీ, బీపీ, షుగర్, జనరల్ చెకప్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఇద్దరికి కేన్సర్ వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ చేసి వారికి స్థానిక ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స చేసేందుకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత, గ్రామస్తులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: మందులను పంపిణీ చేస్తున్న పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి

200 మందికి ఉచితంగా మందుల పంపిణీ

డెంకాడ: విజయనగరం శ్రీసాయిసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. డెంకాడ పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, గ్రామ సర్పంచ్ పతివాడ గౌరీ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ కె సింధూరి, చెవి ముక్కు గొంతు వైద్యనిపుణులు డాక్టర్ సత్తి సతీష్ రెడ్డి, దగ్గు జ్వరం జలుబు పై డాక్టర్ కిషోర్ వైద్య సేవలు అందించారు. రోగులను పరిశీలించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి విజయనగరం ఆసుపత్రికి రిఫర్ చేశారు. సుమారు 200 మంది రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు, పెద్దలు, సాయి స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు

కోలాటం పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలకు విశేష స్పందన లభించింది. శ్రీకళాభారతి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం పోటీలకు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. పోటీలను డిఎస్పి పి.మోహనరావు సందర్శించి కలలను, కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కళాకారులను అభినందించారు. పోటీలలో మొదటి స్థానంలో శ్రీలక్ష్మి నరసింహా బృందం, రెండో స్థానంలో శ్రీదుర్గాదేవి బృందం, మూడో స్థానంలో అరసాడ జిల్లా పరిషత్ పాఠశాల బృందం, నాలుగో స్థానంలో జానకిరమణ బృందం, ఐదో స్థానంలో శ్రీసిద్ధి వినాయక బృందం, ఆరో స్థానంలో బంగారమ్మతల్లి బృందం నిలిచాయి. విజేతలకు డిఎస్పి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకళా భారతి కమిటి సభ్యులు ఎన్. వేణుగోపాల్, ఎం.విజయమిహన్, వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు, కళాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి శిక్షణ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

నేటి నుంచి పదో తేదీ వరకూ పంచాయతీలలో ఎన్నికైన ఉప- సర్పంచ్లకు, పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లుకు ఆర్జిఎస్ఎ కార్యాచరణ ప్రణాళిక 2024-25లో భాగంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీలలో సాధారణ, కనీస పరిపాలన విధానం, ఎపిపిఆర్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు వంటి పది అంశాలపై రెండు రోజుల మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు.

పాఠశాలకు గ్యాస్ స్టవ్ వితరణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు అదే పాఠశాల ఉపాధ్యాయుడు ఆతవ రవిశంకర్ గ్యాస్ స్టవ్ను ఉచితంగా అందజేశారు. ఆయన్ను పాఠశాల సిబ్బందితోపాటు పేరెంట్స్ అభినందనలు తెలిపారు.

14 మంది అరెస్టు

ప్రజాశక్తి - బాడంగి

మండలంలోని కోడూరు గ్రామ చివరలో 14 మంది కోడి పందేలు ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 9200 నగదు, 5 కోళ్లు, ఒక్క మోటార్ సైకిల్, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి మామిడి తోటలో కోడి పందెం ఆడుతున్నట్లు తెలిపారు. ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం జంక్షన్ వద్ద ఏ విధమైన అనుమతులూ లేకుండా ఎస్ కోట వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ఇసుక లారీని వల్లంపూడి ఎస్ఐ బి. దేవి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అనుమతి పత్రాలూ లేకపోవడంతో లారీని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

నా తండ్రి చావుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణం

ప్రజాశక్తి - గజపతినగరం

నా తండ్రి చావుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తుమికాపల్లి గ్రామానికి చెందిన హేమలత ఆరోపించారు. ఆ గ్రామానికి చెందిన రాపర్తి నూకరాజు (65) అనే వ్యక్తి స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆదివారం గుండెపోటుతో మరణించాడు. అయితే అతని రెండవ కుమార్తె హేమలత తన తండ్రి చావుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ, ఆసుపత్రి మొత్తానికి ఒకే ఒక్క డాక్టర్ ఉండడంతో తన తండ్రికి సకాలంలో వైద్యం అందక విగత జీవిగా మారాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బందితో ఘర్షణకు దిగడంతో స్థానిక ఎస్ఐ కె.లక్ష్మణరావు ఆసుపత్రి వద్ద చేరుకుని ఆమెతో మాట్లాడి ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని చెప్పి మృత దేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

వైద్యం అందించాం : సూపరింటెండెంట్

రాపర్తి నూకరాజు అనే వ్యక్తి గొంతులో మంటగా ఉందంటూ మందుల షాపులో టాబ్లెట్ తీసుకుని వేసుకుని చాలా ఇబ్బందికర పరిస్థితిల్లో ఆస్పత్రికి వచ్చారు. అది గమనించిన డ్యూటీ డాక్టర్ వినీత్ వెంటనే పాన్టాప్ ఇంజక్షన్ ఇచ్చి వైద్యం ప్రారంభించారు. వైద్యం మధ్యలోనే ఆయన మరణించారు. కరెంట్ షాక్ ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. ఒక వైద్యునిగా చేయాల్సిన వైద్యం మొత్తం చేశారు. కానీ ప్రయోజనం లేకపోయింది.

- జగదీష్, సూపరింటెండెంట్, ప్రభుత్వాస్పత్రి, గజపతినగరం